

ఆశల సాగు!



ఆశల సాగులో రైతన్నలు నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో తీవ్ర నష్టం వాటిల్లడంతో రబీ సీజన్ అయినా తమను గట్టెక్కించకపోతుందా అనే కోటి ఆశలతో వరి నాట్లు వేస్తున్నారు. బండిఆత్మకూరు మండలంలో దాదాపు అన్ని గ్రామాలూ వరి ఆధారితమే. శుక్రవారం ఒకపక్క ట్రాక్టర్లతో దమ్ము చేస్తుండగా మరో పక్క కూలీలు వరినాట్లు వేస్తూ కనిపించారు.

– బండిఆత్మకూరు

● మహాధ్వజంపై ఆదిత్యుడి కొలువు!



మహానందిలోని ధ్వజ స్తంభంపైన ఆదిత్యుడి కాంతులు కొలువయ్యాయి. ధ్వజ స్తంభంపైన ఉన్న మేఖల మధ్య భాగంగాలో కాంతులీనుతూ కనిపించాడు. ప్రత్యక్ష దైవంగా పిలిచే సూర్య భగవానుడే సాక్షాత్తూ ధ్వజ మేఖలాన్ని స్పర్శించేందుకు వచ్చినట్లున్న ఈ దృశ్యం శుక్రవారం భక్తులను కనువిందు చేసింది.

– మహానంది

క్లుప్తంగా

పల్లకీలో విహరించిన ఆది దంపతులు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో పూజలు నిర్వహించిన అనంతరం అలంకార మండపం నుంచి ఆలయ ధ్వజ స్తంభం, ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం వైభవంగా సాగింది. ధ్వజ స్తంభం వద్ద స్వామి, అమ్మవార్లకు హారతి పూజలు చేశారు.

1,300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ శివారులో పావురాళ్లగుట్ట అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 1,300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి నాటుసారా స్థావరంపై దాడులు చేసి సారాకు ఉపయోగించే డ్రమ్ములను ధ్వంసం చేశామన్నారు.

పటిష్ట బందోబస్తు చేపట్టాం



సిద్దేశ్వరం ఘాట్లను పరిశీలించిన ఎస్ఐ

కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్రం సింగోటం తిరునాల సందర్భంగా కృష్ణానదిలో మరబోట్లు తిరగకుండా పటిష్ట బందోబస్తు చేపట్టామని ఎస్ఐ ఎం.కేశవ సూచించారు. శుక్రవారం రాత్రి సంగమేశ్వరం, సిద్దేశ్వరం ఘాట్ల వద్ద భద్రతను పరిశీలించారు. బందోబస్తు ఉన్న సిబ్బంది సింగోటం జాతరకు సంగమేశ్వరం నుంచి సోమశిలకు మరబోట్లు వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. జాతరకు వెళ్లేవారు గానీ, తిరిగి వచ్చే వారు గానీ రోడ్డుమార్గంలో ప్రయాణించాలని సూచించారు.

సర్వేలు పూర్తి చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ సర్వేలు పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని చెలిమిళ్ల, ఇస్కాల సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు సిబ్బంది సమయానికి రావాలన్నారు. హాజరు పట్టికలో సంతకాలు చేయాలన్నారు. రికార్డుల్లో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్ సర్వే, నాన్ రెసిడెంట్ సర్వే, పీఏసీ, ఈకేవైసీ సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమించొద్దు



సిద్దేశ్వరం ఘాట్‌వద్ద సిబ్బందితో ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్ నియోజకవర్గం సింగోటం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి జాతర సందర్భంగా మరబోట్లపై కృష్ణానదిలో ప్రయాణికులను తరలిస్తే బోట్లు సీజ్ చేస్తామని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కృష్ణానది పరివాహన ప్రాంతమైన సిద్దేశ్వరం వద్ద ఉన్న మరబోట్ల ఘాటును తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రెవెన్యూ, పోలీసు సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని కృష్ణా నదిలో ఎలాంటి మర బోట్లు తిరగరాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సింగోటం జాతరకు వెళ్లే ప్రయాణికులు బస్సుల్లో వెళ్లేలా ప్రయాణికులకు అవగాహన కల్పించాలన్నారు. బోట్ల మీద ప్రయాణం ప్రమాదకరమన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు వచ్చేదాకా బోట్ల నిర్వాహకులు కృష్ణా నదిలో బోటు తిప్పరాదన్నారు. నిబంధనలు అతిక్రమించి నదిలో మరబోట్లలో ప్రయాణికులను చేరవేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని ఏఓ ఫణీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రగూడూరు గ్రామ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పంటలో తెల్లదోమ నివారణకు అసిటమాప్రైడ్ మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. భూసాంద్రత పరీక్షలు చేయించుకుని తద్వారా నిర్ణీత మోతాదులో రసాయనిక ఎరువులు వాడుకోవాలన్నారు. భూసాంద్రత సమతుల్యం కోసం జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవాలన్నారు. పంట మార్పిడి పద్ధతులను రైతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. రెండుకార్లు ఒకే పంటను నిరవధికంగా సాగు చేయడం వల్ల భూసాంద్రత లోపించి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుచంద్రనాయక్ పాల్గొన్నారు.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: మహానందిలో భక్తుల సందడి కొనసాగుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.

నిందితుడి అరెస్టు

జూపాడుబంగ్లా: మండలంలోని భాస్కరాపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడు అల్లాబకాష్‌ను శుక్రవారం అరెస్టు చేసి నందికొట్కూరు కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 15 రోజుల పాటు రిమాండ్ విధించటంతో అతన్ని నందికొట్కూరు సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

'స్వచ్ఛ దివస్' విజయవంతం చేద్దాం

మిడుతూరు: ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ దశరథరామయ్య కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో స్వచ్ఛందగా పర్యటించి పారిశుద్ధ్య పనులు (చెత్త కుప్పలు, కాలువలు, వాటర్ ట్యాంకులు, పాఠశాలలు, హాస్పిటల్ శుభ్రపరచడం) చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఈఓఆర్డీ సంజన్న, పంచాయతీ పాల్గొన్నారు.

వీఓఏను వేధించిన వారిని సస్పెండ్ చేయాలి



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: వీఓఏ లక్ష్మీదేవి ఆత్మహత్యాయత్నానికి కారణమైన బేతంచెర్ల ఏపీఎం, సీసీలను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, మండల కార్యదర్శి భాస్కర్, వీఓఏ సంఘం నాయకులు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు ఏపీఎం, సీసీలు 29 మంది వీఓఏలను తొలగించామని చెప్పి రంగాపురం వీఓఏ లక్ష్మీదేవిని వేధించడంతో వెలుగు కార్యాలయం ఎదుట పేడ రంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఏళ్ల నుంచి వీఓఏగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీదేవిని రాజకీయంగా వేధించడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, ఇస్మాయిల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, కేవీపీఎస్ నాయకులు సంపత్, శివశంకర్, వీఓఏలు సురేష్, ఇస్మాయిల్, సరళాదేవి, కార్మికులు పాల్గొన్నారు.

20 నుంచి రీ సర్వే

పాములపాడు: ఈనెల 20 నుంచి భూముల రీ సర్వే చేపట్టనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ పటాన్‌బాబు, రీసర్వే డీటీ సుప్రియ తెలిపారు. శుక్రవారం వారు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని కంబాలపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. రీ సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు.

మూర్వకొండ ఘాట్ వద్ద కొనసాగుతున్న బందోబస్తు



ఆర్ఐ శ్రీరంగారెడ్డికి ఆదేశాలు ఇస్తున్న తహసీల్దార్ శివరాముడు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూర్వకొండ ఘాట్, అర్లపాడు ఘాట్‌ల వద్ద పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది. శుక్రవారం తహసీల్దార్ శివరాముడు, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి రెండు ఘాట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నదీ తీరం వెంట ఎలాంటి ఇంజిన్ బోట్ల కదలికలు ఉండరాదన్నారు. నదిలో చేపలు పట్టే మత్స్యకారుల ఇంజిన్ బోట్లు కూడా తిరగరాదని, సింగోటం భక్తుల తిరుగు ప్రయాణం కోసం తప్పనిసరిగా ఇంజిన్ బోట్లను ఆశ్రయించే అవకాశం ఉన్నందున ఘాట్ నిర్వాహకులపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌ల వద్ద బందోబస్తు నిర్వహించాలన్నారు. పొరపాటున ఇంజిన్ బోట్లను ఆశ్రయించే భక్తులను గుర్తించి తిరిగి పంపివేయాలని ఆర్ఐ శ్రీరంగారెడ్డిని ఆదేశించారు. తహసీల్దార్ వెంట ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

'పొలం పిలుస్తుంది'తో రైతులకు సూచనలు

కొత్తపల్లి: పొలం పిలుస్తుంది కార్యక్రమంతో రైతులకు సాగులో సూచనలు ఇస్తున్నామని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ తెలిపారు. దుద్యాల, కొక్కెరంచ గ్రామాల పరిధిలో శుక్రవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుములో తెగులు, నివారణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జీ.శేషు, అశోక్ కుమార్, ఎంపీఈఓ పల్లవి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి



పొగాను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కొత్తపల్లి: పొగాకు రైతులకు కంపెనీలు నిర్ణయించిన గిట్టుబాటు ధర ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఉదయ్ కిరణ్, ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పంచముఖి గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లడతూ పొగాకు సాగు చేసే సమయంలో కంపెనీలు కేటాయించిన ధర రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి ఖర్చు భారంగా మారిందన్నారు. పొలంలో రేయింబవళ్లు కష్టించి పొగాకు పంటను పండించినప్పటికీ రైతుకు ముందుగా మాట్లాడుకున్న నిర్ణయ ధర లభించడం లేదన్నారు. కంపెనీలు ఇష్టానుసారంగా వ్యవరిస్తూ మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించికపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ఏడాది కంటే పొగాకు సాగు ఈ ఏడాది భారీగా పెరిగిందన్నారు. (సిగరెట్)వీఐఎన్-5, వీబీహెచ్-3, రుస్టిక(బీడీ)ఏ-119, నాటు పొగాకును వేశారన్నారు. అక్కడక్కడా ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా పొగాకు కూడా సాగైందన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇండియన్ టొబాకో కంపెనీ(ఐటీసీ), అలయన్స్-1, ఇంటర్నేషన్, వీఎస్టీ, గాడ్స్‌ప్రేపిలిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు రైతులతో పొగాకు సాగు చేయించాయన్నారు. అప్పుడు పొగాకు సాగును ప్రోత్సహించిన కంపెనీలు నేడు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతుల బతుకులతో చెలగాటమాడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోపోతే రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉందని, ప్రభుత్వం స్పందించి కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు అలీబాషా, వెంకట్రామిరెడ్డి, సోమన్న, కరీంబాషా, వీపనగండ్ల మద్దిలేటి, శ్రీధర్, సలీంబాషా ఉన్నారు.

కిలో టమాటా @ రూ.5

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వారపు సంతలో కిలో టమటా కేవలం రూ.5 ధర పలకటంతో వినియోగదారులు అధికంగా కొనుగోలు చేశారు. గత నెలలో కిలో టమాటాల ధర రూ.80 పలకగా ప్రస్తుతం రూ.5లకే విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఒక్కొక్కరు రెండు, మూడు కిలోలు కొనుగోలు చేశారు. రైతులు పండించిన టమటాలు చేతికందగానే అమాంతం ధర పడిపోవటంతో తీవ్రంగా నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లైసెన్స్ తప్పనిసరి



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఎం.కేశవ

కొత్తపల్లి: ప్రతి వాహన దారుడు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.కేశవ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నందికుంట గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. బైక్‌పై వెళ్లే వారు తప్పకుండా హెల్మెట్ ధరరించాలన్నారు. అనంతరం సరైన పత్రాలు లేని, నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు మల్లికార్జున, అశ్వక్ ఉన్నారు.



■ నడిరోడ్డుపై మురుగు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల దళిత కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సిమెంటు రోడ్లు నిర్మించినా డ్రైనేజీలేక పోవటంతో ఇళ్లల్లోంచి వచ్చే మురుగు నీరంతా సిమెంట్ రోడ్లపైనే నిలబడిపోతుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాప్తి చెంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్లు నిర్మించి మురుగు సమస్యను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అధిక దిగుబడులు సాధించండి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓలు హేమలత, కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ హేమలత, జూపాడుబంగ్లా ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం పారుమంచాల గ్రామంలో శనగపంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు శనగపంటలో వ్యాపించి చీడపీడల నివారణకు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తగిన మోతాదులో రసాయనిక మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పురుగుల వ్యాప్తిని నివారించేందుకు బ్లూ, ఎల్లో కలర్ అట్టలను పొలంలో ఏర్పాటుచేసుకోవటంతోపాటు పొలం చుట్టూ బంతిపూలను నాటుకోవాలన్నారు. శనగలో వ్యాపించే ఎండుతెగులు నివారణకు గాను శిలీంధ్ర నాశిని మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పంటల బీమాతో పాటు కందుల విక్రయానికి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ



మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య

మిడుతూరు: స్థానిక మండల సమాఖ్య భవనంలో ఎంపీడీఓ దశరథరామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉల్లాస్‌కు చెందిన వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వయోజనులకు విద్యపై వలంటీర్లకు పూర్తి అవగాహన కల్పించారు. వారికి ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, వలంటీర్ వ్యవస్థ ఎలా పనిచేయాలి అనే విషయంపై వివరించారు. ఏ విధమైన పారితోషికం ఉండదని, పూర్తిగా ఉచితంగా వయోజనులకు విద్య నేర్పించాలని సూచించారు. మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీలు, 4 మజారా గ్రామాలు ఉన్నాయని, 850 మందిని వయోజనులను గుర్తించామని చెప్పారు. ప్రతి పది మందికి ఒక వలంటీర్ చొప్పున 85 మంది వలంటీర్లకు శిక్షణ కల్పించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు వయోజనులకు విద్యాభ్యాసం చేయాలన్నారు. 15 నుంచి 50 ఏళ్లలోపు నిరక్షరాస్యులకు, పొదుపు మహిళలకు ఉచిత విద్యను అందించాలన్నారు. అనంతరం వయోజన విద్యకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో వయోజన విద్య కన్సల్టెంట్ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం సుబ్బయ్య, సీసీలు, పాల్గొన్నారు.

పశుపోషకులకు గోకులం షెడ్లు ప్రయోజకరం



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: పశువులు, జీవాలు, కోళ్ల పోషకులకు గోకులం షెడ్లు ప్రయోజనకరంగా ఉంటాయని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. శుక్రవారం పారుమంచాల గ్రామంలో జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం కింద లబ్ధిదారులు నిర్మించుకొన్న గోకులం షెడ్లను సర్పంచ్ మాధవరం ప్రకాశం అధ్వర్యంలో ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని, పశుపోషకులు గోకులం షెడ్లను నిర్మించుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని పశుగ్రాసాలను పెంచుకోవటం వల్ల పశుపోషణ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీ రామాంజనేయులు, ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఓ గౌరీబాయి, పీఆర్ ఏఈ బషీర్, డీటీ నాగన్న, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, మోహన్‌రెడ్డి, జంగాలపెద్దన్న, గిరీశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, వంగలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటనను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. లేకపోతే 19న విజయవాడలో అమిత్‌షా పర్యటన వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు పి.పక్కిరి సాహెబ్, టి గోపాలకృష్ణ, శ్రీనివాసులు, టి. ఓబులేసు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ తెలియదా

● తహసీల్దార్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం



తహసీల్దార్ శివరాముడుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పగిడ్యాల: ‘ఏం..ప్రొటోకాల్ అంటే తమాషాగా ఉందా.. అజెండా బుక్‌లెట్‌లో ఎక్కడా ప్రొటోకాల్ పాటించలేదని సంతకాలు చేయకుండా ఉన్నారంటే ఎంపీడీఓ ఏమి చేస్తున్నారు’ అంటూ ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండా ప్రకారం ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభ్యులకు వివరిస్తుండగా తహసీల్దార్ బదులు డిప్యూటీ తహసీల్దార్ మురళీ హాజరు కావడంపై తహసీల్దార్ ఎక్కడా అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ‘ప్రొటోకాల్ పాటించడం తహసీల్దార్‌కు తెలియదా.. మండలం అభివృద్ధి చెందాలా వద్దా.. తక్షణం తహసీల్దార్ సమావేశానికి హాజరుకమ్మని చెప్పండి’ అంటూ ఆదేశించారు. మరోసారి గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అజెండా బుక్‌లెట్ ప్రజాప్రతినిధులకు కూడా ఇవ్వాలని, ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. కృష్ణానది పరివాహక గ్రామాల్లో విస్తరించిన శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో అలివి వలలు లాగుతున్నారని పత్రికల్లో వస్తున్నా ఏం చేస్తున్నారని, రేపటిలోగా అలివి వలలన్నింటినీ స్టేషన్‌లో ఉంచాలని తహసీల్దార్ శివరాముడిని, మత్స్యశాఖ అధికారులను, పోలీసులను ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన మత్స్యశాఖ, కేసీ కాలువ, రవాణా శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి మాట్లాడారు.

నేడు, రేపు శ్రీశైలంలో పారిశుద్ధ్య పనులు

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు ‘మన ఊరు–మనబడి–మన బాధ్యత’ స్వచ్ఛంద సేవా సంస్థ నంద్యాల విభాగం కన్వీనర్ కె.రఘువీర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థకు చెందిన 250 మంది క్షేత్ర పరిధిలోని పలుచోట్ల స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. శనివారం ఘంటామఠం ప్రాంగణం, గంగాభవానీ స్నానఘట్టాలు, పాతాళగంగ మెట్ల మార్గం, పాతాళగంగ స్నానఘట్టాలు, శిఖరేశ్వరాలయం, పుష్కరిణి వద్ద స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఏనుగుల చెరువుకట్ట వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నామన్నారు.